ప్రజాశక్తి

సోమవారం 21 జులై 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

గుంటూరులో కుండపోత

జిల్లాలో భారీ వర్షం నమోదు - వర్షాలతో సేదతీరిన ప్రజలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఇదే పరిస్థితి మరో మూడు రోజుల పాటు కొనసాగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేని వానతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలుచోట్ల ఇళ్లల్లోకి వర్షపునీరు ప్రవేశించింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. గుంటూరులోని డొంకరోడ్డు వద్ద కల మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌యుబి వద్ద నీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. గత 40 రోజులుగా వర్షాలు లేక అల్లాడుతున్న ప్రజలకు తాజాగా కురుస్తున్న వర్షాలతో ఉక్కపోత, ఎండల తీవ్రత, వేడిగాలుల నుంచి ఉపశమనం లభించింది. మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు, మేడికొండూరు, గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు, కొల్లిపర, తెనాలి, వట్టిచెరుకూరు, చేబ్రోలు, దుగ్గిరాల, ప్రత్తిపాడు, పెదనందిపాడులో భారీ వర్షం కురిసింది.

గుంటూరు జిల్లాలో జూన్‌లో 164.9 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు 93 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైన ర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెదకాకాని 77.2 మిల్లీ మీటర్లు, దుగ్గిరాల 67.8, గుంటూరు తూర్పు 54.2, గుంటూరు పశ్చిమ 40.2, మంగళగిరి 28.2, మేడికొండూరు 13.6, తాడేపల్లి 12.4, ప్రత్తిపాడు 9.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గత నెలలో 97.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 65.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

▶ 2లో

రాజధానిలో కరెంటు కట్

- సెల్‌ఫోన్ లైటు వెలుతురులోనే క్రయవిక్రయాలు
- అవస్థపడ్డ రాజధాని నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి -తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు, పరిసర గ్రామాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. 6.30 గంటలకు వర్షం మొదలవగా కొద్ది సేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.రాజధాని నిర్మాణం పనులు నిమిత్తం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ప్రతి ఆదివారం నిత్యావసర వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. తుళ్లూరు లైబ్రరీ సెంటర్, పెద్ద బజారులో కార్మికుల సందడి నెలకొంటుంది. వర్షం కురవడంతో కార్మికులు నిత్యావసర సరుకుల కొనుగోలుకు ఇబ్బంది పడ్డారు. వ్యాపారులు సెల్‌ఫోన్ల వెలుతురులో అమ్మకాలు సాగించారు. చిల్లర దుకాణాలు, చికెన్ షాపులు, వస్త్ర దుకాణదారులు సెల్‌ఫోన్ వెలుగు ఆధారంగానే పని చేసుకున్నారు. మెకానిక్ షాపుల్లోనూ మరమ్మతుల సందర్భంలో ఇదే పరిస్థితి నెలకొంది. మరోవైపు సరుకుల కోసం వచ్చిన కార్మికులు వర్షంలో చిక్కుకోవడంతో నిర్మాణ సంస్థలకు చెందిన వాహనాలలో ఇళ్లకు తరలించారు.

సిపిఎం నాయకులకు తన పరిస్థితిని వివరిస్తున్న పిండిమర నిర్వాహకుడు సీతారామస్వామి

పిండిమరకు రూ.24 వేల బిల్లు

- స్మార్ట్ మీటరు తీసేసి పాత మీటరే పెట్టాలని నిర్వాహకుని ఆవేదన
- సిపిఎం నాయకుల పరిశీలన సందర్భంగా వెలుగులోకి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దు పాత మీటర్లే కావాలి అని సిపిఎం నాయకుల ఎదుట పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన పిండిమర నిర్వాహకులు కోట సీతారామస్వామి వాపోయారు. విద్యుత్ స్మార్ట్ మీరట్లకు వ్యతిరేకంగా సిపిఎం చేపట్టిన ప్రచారంలో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఇతర నాయకులు శనివారం 25వ వార్డు గుడిపూడివారి వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా పిండిమరను నిర్వహిస్తున్న వ్యక్తితో నాయకులు మాట్లాడగా ఆయన తన ఆవేదనను వివరించారు. స్మార్ట్ మీటర్ బిగించినప్పటి నుండి కరెంట్ బిల్లు అనేక రెట్లు ఎక్కువగా వస్తోందని చెప్పారు. రెండు మోటార్లు, ఒక లైటు, ఫ్యాను ఉంటాయని, గతంలో రూ.2-3 వేల బిల్లు వచ్చేదని, స్మార్ట్ మీటర్ బిగించాక ఈనెల రూ.9 వేలు వచ్చిందని చెప్పారు. బిల్లు భారీగా వచ్చింది.. పరిశీలించాలని విద్యుత్ శాఖాధికారులను సంప్రదించగా వారు ఆ బిల్లులను చూసి రూ.24,360 బిల్లు వచ్చినట్లు చెప్పారని, అంతెందుకొచ్చిందని ప్రశ్నించగా అదేమీ మాకు తెలియదు.. ఎంత వస్తే అంత కట్టాల్సిందే.. అని చెప్పారని సీతారామస్వామి వాపోయారు. మీటరులో లోపాలున్నాయేమో చూసి మార్చాలని కోరినా అదానీ కంపెనీ వారు బిగించిన మీటరును అ కంపెనీ వారే చూడాలిగాని తమకు సంబంధం ఉండదని చెప్పారని అన్నారు. తాను నెలలో 25 రోజులు షాపును తెరుస్తానని, ఈ లెక్కన రోజుకు రూ.వెయ్యి చొప్పున బిల్లు వస్తోందని సీతారామస్వామి చెప్పారు. తనుకు రోజు మొత్తం వచ్చే ఆదాయమే రూ.వెయ్యి ఉండదని, ఇహ అంత బిల్లును ఎలా చెల్లించగలనని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్‌ను తీసేసి పాతమీటరే పెట్టాలని కోరారు.

సాగర్‌కు వరద ప్రవాహం

566.70 అడుగులకు నీటినిల్వ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ నుండి నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో ఆదివారం సాయంత్రం నాటికి నాగార్జునసాగర్ జలాశచ నీటిమట్టం 566.70 అడుగులకు చేరింది. ఇది 248.2946 టిఎంసీలకు సమానం. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు. సాగర్‌కు ఎగువనున్న శ్రీశైలం జలాశయం నుండి 67,556 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో ఎడమ కాల్వ ద్వారా 1000 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం పెరిగితే మరికొద్ది రోజుల్లో నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉంది.

ప్రజల్ని చైతన్యవంతం చేసేందుకు కళారూపాలు

ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు

ప్రజాశక్తి - మంగళగిరి

సమాజంలోని రుగ్మతలకు, సమస్యలకు పరిష్కారాలను చూపడానికి ప్రజా కళాకారులు అనేక కొత్త కళారూపాలు సృష్టించి ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రజానాట్యమండలి కృషి చేస్తుందని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కళారూపాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు పద్మ అధ్యక్షత వహించారు. అనిల్ మాట్లాడుతూ ప్రజల మధ్య సామరస్య భావాన్ని పెంపొందించడానికి కళాకారులు కృషి చేయాలని, విద్వేషాలు సృష్టించే వారి ఎత్తుగడలను తిప్పి కొట్టాలని అన్నారు. కళారూపాల ద్వారా ప్రజలు త్వరగా చైతన్యమవుతారని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నాయని, స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ భారాలు

▶ 2లో

అంబేద్కర్ సెంటర్లో కళారూపాలను ప్రదర్శిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

సమావేశంలో మాట్లాడుతున్న కె.సుబ్బరావమ్మ

సిడిపిఒ కార్యాలయాల వద్ద నేడుధర్నా

అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎఫ్‌ఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా సిడిపిఒ కార్యాలయాల వద్ద సోమవారం చేసే ధర్నాలో అంగన్వాడీలు, లబ్ధిదార్లు పాల్గొనాలని ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కెపి.మెటిల్డాదేవి అధ్యక్షతన ఆదివారం జరిగింది. సుబ్బరావమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ సమస్యలు తీరతాయని భావించిన అంగన్వాడీల పరిస్థితి పొయ్యి మీద నుంచి పెనం మీద పడిన చందంలా మారిందన్నారు. అంగన్వాడి సెంటర్ల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న పోషకాహారం పొందాలంటే ఎఫ్‌ఆర్‌ఎస్ తప్పనిసరి అయిన నేపథ్యంలో సర్వర్లు మొరాయించటం నెట్వర్క్, ఇతర

▶ 2లో

చట్టానికి విరుద్ధంగా కోర్టు భవన నిర్మాణానికి భూమి కేటాయింపు

చెరువు భూమిలో నిర్మాణానికి అభ్యంతరం లేదని కౌన్సిల్ తీర్మానం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చెరువు భూమిని కోర్టు భవన నిర్మాణం కోసం కేటాయించడం వివాదాస్పదమైంది. పట్టణంలోని 38వ వార్డులో గల పురుషోత్తమ పట్టణలోని సర్వే నంబర్ 186/3లో 1976 నుండి 4.75 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉండేది. దీన్ని నల్లకుంట చెరువు పేరుతో పిలుస్తుండేవారు. ఈ చెరువును సాగర్ నీటితో నింపి తాగు నీటిగా ఉపయోగించుకోవడంతోపాటు ఆరుతడి పంటల సాగుకూ వినియోగించేవారు. గంగమ్మ తల్లి జాతర పేరుతో ప్రతిఏటా జాతర చేసేవారు. అయితే కాలక్రమంలో ఈ చెరువు ఆక్రమణలకు గురవుతూ వచ్చింది. దీనికి వ్యతిరేకంగా పలు ఉద్యమాలూ జరిగాయి. అయినా ఆక్రమణలను నిలువరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపలేదు. ఫలితంగా ప్రస్తుతం 91 సెంట్ల విస్తీర్ణంలో మాత్రమే చెరువు భూమి మిగిలగా ఇందులో సుమారు 10 సెంట్లకే చెరువు పరిమితమైంది.

ఈ నేపథ్యంలో ఈ చెరువు స్థలంలోనే అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణం కోసం ఆమోదం తెలుపుతూ ఈనెల 18న నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానాన్ని

కోర్టు భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలం

ఆమోదించారు. దీనికి ముందు ఈ స్థలం పరిస్థితిపై వివరణ కోరుతూ తహశీల్దార్‌ను మున్సిపల్ కమిషనర్ ప్రతిపాదన పంపగా చెరువు భూమిగా పేర్కొంటూ తహశీల్దార్ పేర్కొన్నారు. దీన్ని ప్రాతిపదిక చేసుకుని ఆ భూమిలో భవన నిర్మాణానికి అభ్యంతరం లేదని తెలుపుతూ తీర్మానిస్తూ ఆ ప్రతిపాదనను జిల్లా మెజిస్ట్రేట్ అయిన కలెక్టర్‌కు పంపాలని తాజాగా మున్సిపల్ కౌన్సిల్లో తీర్మానించారు.

అయితే చెరువు స్థలాన్ని కోర్టు భవన నిర్మాణానికి కేటాయించడంపై పసుమర్రుకు చెందిన హైకోర్టు న్యాయవాది గుదే రవితేజ స్పందిస్తూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఇది పర్యావరణ పరిరక్షణ నిబంధనలకు వ్యతిరేకమన్నారు. ఒకసారి నీటి ప్రదేశంగా గుర్తించిన వాటిని మార్చకూడదని అనేకసార్లు తీర్పులు వచ్చాయని చెప్పారు. హించ్ లాల్ తివారీ వర్సెస్ కమలాదేవి, ఇంటెలెక్చ్యుయల్స్ ఫోరమ్ తిరుపతి వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, జితేంద్ర సింగ్ వర్సెస్ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ తదితర కేసులను ఉదహరించారు. చెరువులు, ఇతర సహజ వనరులకు ప్రభుత్వం యాజమాన్యంగా కాకుండా పరిరక్షణ బాధ్యతదారుగా వ్యవహరించాల్సి ఉంటుందని, నిర్వహణా అంతే ఉండాలని చెప్పారు. పట్టణంలోని చెరువు భూమిలో కోర్టు భవనానికి పూనుకుంటే భవిష్యత్‌లో అనేక న్యాయపరమైన చిక్కులు వస్తాయని, నిర్మాణమూ ముందుకు సాగదని చెప్పారు. వివాద రహిత భూమిని కోర్టు నిర్మాణానికి కేటాయించాలని కోరారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి - నకరికల్లు

మండల కేంద్రమైన నకరికల్లులో మట్టి అక్రమ మైనింగ్ జరుగుతోంది. రేయింబవళ్లు మట్టిన తరలిస్తున్న భారీ వాహనాల కారణంగా రహదార్లు దెబ్బతినడంతోపాటు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద బ్రిడ్జి నెర్రలిచ్చి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. బ్రిడ్జిపై నుంచి భారీ టిప్పర్లతో మట్టిని తరలిస్తుండడాన్ని గ్రామస్తులు తప్పుబడుతున్నారు. నకరికల్లు శివారు గ్రామాలైన శివాపురం తండా, సాస్ ఉదయ నగర్ తండా గ్రామస్తులు ఎవరైనా చుట్టుపక్కల ప్రాంతాలకు పోవాలన్న, నకరికల్లుకు రావాలన్నా, రైతులు పొలాలకు వెళ్లాలన్నా ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అయితే ఇవేమీ అధికారులకు పట్టడం లేదు. అక్రమ మైనింగ్‌పై రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదు. దీనిపై తాహశీల్దార్ పుల్లారావును వివరణ కోరగా బ్రిడ్జిపై వచ్చిన పగుళ్లను పరిశీలిస్తామని, అక్రమ మైనింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

టిడిపి నరసరావుపేట పట్టణ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : టిడిపి పట్టణ కమిటీ ప్రమాణ స్వీకారం నరసరావుపేటలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం నుంచి ర్యాలీ చేశారు. సభా ప్రాంగణంలో ఎన్టీఆర్, కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పూలమాలలేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ మరింత బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలన్నారు. అధ్యక్షునిగా గట్టుపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గూడూరి శేఖర్, కార్యవర్గ సభ్యులుగా కుంచాల బాజీ, అత్తులూరి సీతయ్య, గురజాల నాగేశ్వరరావు, మంగళగిరి ఆనంద్, షేక్. అల్లాబక్షు, సానే శ్రీనివాసరావు, మేడికొండ కనకయ్య, మోతే రమేష్ బాబు, షేక్ బుడే, మంద కోటయ్య, పోక జయమ్మ, నేలటూరి పద్మ రాఘవమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, కపలవాయి విజయ్ కుమార్, షేక్, మీరావలి, కొల్లి బ్రహ్మయ్య, కొట్టా కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

గుంటూరులో కుండపోత

(మొదటి పేజీ తరువాయి)

అయింది. దీంతో ఇప్పటి వరకు వర్షాభావం నెలకొనగా ప్రస్తుత వర్షాలతో ఈ పరిస్థితులు తొలగిపోయి వర్షాలు మెరుగుపడటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి, నాదెండ్ల, నరసరావుపేట, రొంపిచర్ల, ముప్పాళ్ల, చిలకలూరిపేట, యడ్లపాడు తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు 84.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 43.1 మిల్లీ మీటర్లు నమోదైంది. వర్షం మరో రెండ్రోజులు కొనసాగితే వచ్చే వారంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో పత్తి, డెల్టాలో వరిసాగుకు రైతులు ఉద్యుక్తులవుతున్నారు.

గ్రామాల్లో పర్యటిస్తాం : బాలవజ్రబాబు

ప్రజాశక్తి - తుళ్లూరు : తుళ్లూరులో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం ఆదివారం జరిగింది. వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) మాట్లాడారు. చంద్రబాబు మోసం వల్లే 2029లో మళ్ళీ వైసిపి అధికారంలోకి వస్తుందని అన్నారు.రాబోయే రోజుల్లో గ్రామ అధ్యక్షులతో కలిసి గ్రామాల్లో పర్యటిస్తానని చెప్పారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామాంజిరెడ్డి

ప్రజాశక్తి - పెదకాకాని

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఎస్.రామాంజిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో సంచార వైద్యశాల మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. వర్షాకాలంలో తమ పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నీటి నిల్వలు ఉంటే అవి దోమలకు ఆవాసాలుగా మారి వాటి సంతతిని వద్ధి చేసుకొని డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి విషజ్వరాలను వ్యాప్తి చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రం చేసుకొని దోమతెరలు వాడాలని సూచించారు. బిపి,షుగరు వంటి వ్యాధులను మొదటి దశలోనే గుర్తిస్తే కిడ్నీ,గుండె మరియు మెదడుకు సంబంధించిన వ్యాధుల బారిన పడకుండా ఉండే అవకాశం ఉంది అన్నారు. సంచార వైద్యశాల ప్రతినెల సంబంధిత సెంటర్లలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా ప్రతి ఒక్కరికి మందులు పంపిణీ చేయడం జరుగుతుంది అన్నారు.రోగులు తప్పనిసరిగా వైద్య పరీక్ష రికార్డులను భద్ర పరుచుకోవాలని కోరారు.ఈ వైద్య శిబిరంలో సిహెచ్ఓ నితీష, ఎఎన్ఎంలు వి.రాజ్యలక్ష్మి, జి.గ్రేస్, ఆశ వర్కర్లు రత్నకుమారి, ఝాన్సీ, కనకం పాల్గొన్నారు.

మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ పాలకవర్గ సభ్యులు ఆదివారం సాయంత్రం మంగళగిరి పట్టణంలో గల మార్కెట్ యార్డ్ కార్యాలయంలో మార్కెటింగ్ జాయిన్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా జవాద్ కిరణ్ చందు, వైస్ చైర్మన్‌గా వై.భాగ్యరావు, 13 మందిని డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, పడవల మహేష్, మాదల రమేష్, దానబోయిన సుందర యాదవ్, ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మంగళగిరి మార్కెట్ యార్డ్ సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

అరెస్టులు చేసి జగన్ ప్రభంజనాన్ని ఆపలేరు : వైసిపి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : ఎన్ని అక్రమ అరెస్టులు చేసిన జగన్ ప్రభంజనాన్ని ఎవరు ఆపలేరని వైసిపి మండల కన్వీనర్ చల్ల హనుమంత్ యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏం.పి మిథున్‌రెడ్డి అరెస్టును ఖండించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. కక్ష సాధింపు చర్యలు వలన ప్రజలు రోడ్ల పైకి వచ్చి కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాపతు వెంకట రమణ, గండు నాగరాజు, గోవింద్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

పెద్దలతో పాటు పిల్లలు శ్రమదానం

ప్రజాశక్తి - తాడేపల్లి : సీతానగరం బోటుయార్డ్ దగ్గర నుంచి హై స్కూల్ కి వెళ్ళటానికి దారి మొత్తం పిచ్చి చెట్లు, ముళ్లకంపతో నిండిపోయింది. ప్రజలు రాకపోకలు సాగించడానికి, విద్యార్థులు పాఠశాల కెళ్ళి రావడానికి ఇబ్బందిగా మారింది. చెట్ల మధ్యలో నుంచి విష పురుగులు ఎటు నుంచి ఎటు వస్తాయో తెలియక భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. ఇది కాదు అని నిర్ణయించుకొని విద్యార్థిని విద్యార్థులు దారి బాగు చేయటానికి నడుం బిగించారు. వీరికి పెద్దలు కూడా తోడయ్యారు. ఆదివారం ఉదయం మొదలైన పనులు సాయంత్రానికి పూర్తయ్యాయి. బోటు యార్డు దగ్గర నుండి సీతానగరం హైస్కూల్ వర్కి రాకపోకలు సాగించడానికి వీలుగా చక్కని దారి స్థానికులు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కే మేరీ, కొండలు, పల్లవి, పవిత్ర, మేఘన, జెస్సీ, స్వీటీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్ని చైతన్యవంతం చేసేందుకు కళారూపాలు

(మొదటి పేజీ తరువాయి)

వేస్తూ అదానీకి లాభం చేకూర్చే విధంగా విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మిక హక్కులను, చట్టాలను కాలరాస్తున్నారని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం లేన శక్తుల గుట్టు రట్టు చేసేలా కళారూపాలని సృష్టించి ప్రజలను చైతన్య పరుస్తామని అన్నారు. అధిక ధరలకు, ప్రైవేటీకరణకు కుల, మత ద్వేషాలకు వ్యతిరేకంగా ప్రజలందర్నీ సంఘటిత పరచడానికి ఈ కళారూపాలు దోహదపడతాయని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.రవి మాట్లాడుతూ రాజధాని అమరావతిలో కష్టజీవులకు, కార్మికులకు కర్షకులకు న్యాయం చేయకుండా కార్పొరేట్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఊడిగం చేసేలా కూటమి ప్రభుత్వ చర్యలు ఉన్నాయని విమర్శించారు. ప్రజా రాజధానిగా అమరావతిని నిర్మించాలని గతం నుండి కోరుతున్నామని, సామాన్య ప్రజలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో సంతోషంగా జీవించేలా రాజధాని నిర్మాణం చేపట్టాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు మద్దతుగా ప్రజా కళాకారులు నిలవాలని కోరారు. కళ కళ కోసం కాదు ప్రజల కోసం అన్న గరికపాటి రాజారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పాటుపడుతున్న కళాకారులు అందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఆర్‌వి రాఘవయ్య, లూథర్‌పాల్, సుమ, రాజ్యలక్ష్మి, పార్వతి, ప్రసాద్, బాలాజీ, బుజ్జిబాబు, జి.శ్రీనివాస్ రావు, శ్రీధర్, రాజమోహన్, సాంబశివరావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిడిపిఓ కార్యాలయాల వద్ద నేడుధర్నా

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలతో అంగన్వాడీ సెంటర్లో పోషకాహార నిల్వలున్నా లబ్ధిదారులకు ఇవ్వడంలో జాప్యమవుతోందని చెప్పారు. ఈ క్రమంలో అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. 42 రోజుల అంగన్వాడీల సమ్మె సందర్భంగా ఇచ్చిన మినిట్స్ అమలు అవుతాయని ఆశించి బంగపడ్డారన్నారు. నాలుగేళ్ల క్రితం ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదని, వాటి స్థానంలో 5జి ట్యాబ్‌లు పంపిణీ చేయాలని కోరారు. మినీ సెంటర్లను, మెయిన్ సెంటర్లుగా ఆగస్టు నాటికి మారుస్తామని చెప్పి స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయలేదన్నారు. అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఒంటరి మహిళలకు వితంతు పెన్షన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎ.ఎల్ ప్రసన్న, బివి రమణ, సాయి, నిర్మల, కవిత, జ్యోతి, అహల్య, సుజాత, సావిత్రి, శ్రీదేవి పాల్గొన్నారు.

నాడు బద్దలు కొట్టమన్న వారే నేడు అదానీకి వంత పాడుతున్నారు

ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లను అనుమతించొద్దని సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి - పెదకాకాని

నాడు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టడి అన్న టిడిపి నేతలు నేడు ప్రజలపై భారాలు వేసే విద్యుత్ స్మార్ట్ మీటర్ల విషయంలో దొంగ నాటకాలు ఆడుతున్నాయని, విద్యుత్ మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించి ప్రజల ధనాన్ని లూటీ చేయడానికి మార్గం చేస్తున్నాయని సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి విమర్శించారు. ఆదివారం నంబూరు ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో శాఖా కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో శివాజి మాట్లాడుతు అదానీ గ్రూప్ కంపెనీకి మన రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు బిగించేటువంటి ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని, దీనివల్ల ప్రజలపై అధిక భారాలు పడి ప్రజలు ఇబ్బందులు పడతారని ఆయన తెలిపారు ఎన్నికల ముందు ప్రజలపై విద్యుత్ బారాలు మోపబోమని హామీ ఇచ్చినటువంటి కూటమి ప్రభుత్వం సర్దుబాటు ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో అధిక భారాలు వేస్తుందని, స్మార్ట్ మీటర్ల ఒప్పందంతో ఈ విధంగా మరన్ని భారాలు ప్రజలపై మోపడం తగదన్నారు. ఈ విధానం మొబైల్ ఫోన్ రీఛార్జి లాగా ముందే డబ్బులు చెల్లించి విద్యుత్ కొనుగోలు చేయాల్సినటువంటి పరిస్థితి ఉంటుందని బిల్లు వచ్చిన తర్వాత చెల్లించే విధానం ఉండదని ఉదయం ఒక రేటు సాయంత్రం ఒక రేటు చొప్పున అధిక భారాలు ప్రజలపై పడతాయని ఆయన అన్నారు. ప్రజలందరూ స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలను వ్యతిరేకించాని ఆయన పిలుపునిచ్చారు ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన నంబూరు సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో పలు స్థానిక సమస్యలు ఉన్నాయని పారిశుధ్యం, డ్రైనేజీ, మంచినీరు, గ్రామంలో నుండి హైవేకి ఇతర గ్రామాలకు లింకు రోడ్లు, గ్రామం గుండా ప్రవహించే టువంటి గుంటూరు ఛానల్ ఇతర పంట కాలువలు మరమ్మతులు ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిష్కార చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు జొన్నల అప్పిరెడ్డి, అన్నపురెడ్డి కోటిరెడ్డి,కె.ఆదాం తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శివాజి

5న విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద ఆందోళన

జయప్రదం చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - పెదకాకాని

స్మార్ట్ మీటర్లు వినియోగం ద్వారా ప్రజలు ఎదుర్కోనె ఇబ్బందులను వివరిస్తూ ఆదివారం సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రజలకు ఇంటింటికి తిరిగి సుందరయ్య కాలనీలో కరపత్రాల పంపిణీ, ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ వినియోగదారులకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. ప్రీపెయిడ్ మీటర్ తో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడుతుందని, స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఇళ్లకు వస్తే ప్రతి ఒక్క వినియోగదారుడు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికీ సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల పై భారాలు వేస్తూ ప్రభుత్వాలు నేడు స్మార్ట్ మీటర్ల పేరుతో మీటర్లు బిగించి మీటర్లకు అయ్యే ఖర్చు కూడా దశల వారి కరెంట్ బిల్లులో వసూలు చేసే ప్రక్రియ చేపడుతారన్నారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న సమయాల్లో అధిక ధరలు వేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తారన్నారు. ఆదాని స్మార్ట్ మీటర్లు ఇండ్లకు బిగించాలి అనే ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 5న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు బురదగుంట సాంబయ్య, సిఐటియు నాయకులు కే రాఘవయ్య, ఆర్ వెంకటేశ్వర్లు, పి పరమేశ్వర రావు, సుందరయ్య కాలనీ వాసులు జెట్టి రాజ్యలక్ష్మి ఎస్.కె మరింబి మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు ప్రజలు

రుమటాలజీ సమస్యలకు అత్యాధునిక వైద్యం

అవగాహన సంస్థ ఆరోగ్య సభలో రుమటాలజిస్ట్ డాక్టర్ అలేఖ్య

ప్రజాశక్తి-గుంటూరు

మనిషి ఎముకలలో కాల్షియం తగు మోతాదులో లేని కారణంగా ఆస్టియో పోరోసిస్ వ్యాధికి గురవుతారని రుమటాలజిస్ట్ డాక్టర్ ఆముదాలపల్లి అలేఖ్య అన్నారు. అవగాహన ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ అలేఖ్య మాట్లాడుతూ ఈ సమస్య వల్ల చిన్నచిన్న కారణాలకు కూడా ఎముకలు విరిగే ప్రమాదం ఉందని అన్నారు. మన ఆహారంలో కాల్షియం మన శరీరానికి ప్రయోజనకారిగా మారాలంటే డి విటమిన్ అవసరమని, కావున ప్రతి ఒక్కరూ రోజూ ఉదయం కనీసం 60 నిమిషాలు శరీరానికి సూర్యరశ్మి తగిలే విధంగా వ్యాయామం గానీ వాకింగ్ చేయడం మంచి దన్నారు. కీళ్లవాతం గురించి వివరిస్తూ మన శరీరంలోని వ్యాధి నిరోధక శక్తి బయట నుండి వచ్చే వైరస్, బ్యాక్టీరి యాలపై పోరాడకుండా మనపైనే పోరాడితే అటువంటి స్థితిని కీళ్లవాతం లేదా ఆర్థరైటిస్ అంటారన్నారు. ఈ ఆర్థరైటిస్‌లో చాలా రకాలు ఉన్నాయని, ఆస్టియో ఆర్థరైటిస్ సమస్య వచ్చినప్పుడు చేతి వేళ్ళు వంకర పోవడం లాంటి లక్షణాలు ఉంటాయన్నారు. గౌట్ వచ్చినప్పుడు కాళ్ళ వేళ్ళు వాచి నొప్పి వస్తుందన్నారు. ఈ సమస్య ఉత్పన్నమైనపుడు వ్యాధిని పూర్తిగా తొలగించడం కుదరదని పెరగకుండా చేయడానికి మాత్రమే అవకాశం ఉందన్నారు. ఆర్థరైటిస్ సమస్య వచ్చినప్పుడు దీర్ఘకాలికంగా తరచూ డాక్టర్‌ను సంప్రదిస్తూ, వారి సలహా మేరకు మందులు వాడుకుంటూ ఉండాల న్నారు. వాస్కులైటిస్ సమస్య గురించి వివరిస్తూ మనలోని వ్యాధినిరోధకశక్తి నరాలపై దాడి చేస్తే ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ సమస్య వచ్చినప్పుడు చర్మం మీద ఎర్రని మచ్చలు, పొక్కులు కనబడతాయని ఇలా లక్షణా లను గమనిస్తే వెంటనే రుమటాలజిస్ట్ సంప్రదించి తగు వైద్యం తీసుకోవాలని సూచించారు.మయోసైట్స్ వ్యాధి గురించి వివరిస్తూ మనలోని వ్యాధినిరోధక శక్తి మనలో కండరాల దాడిచేస్తే ఈ సమస్య ఉత్పన్నమవుతుందని అన్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ గురించి తెలియజేస్తూ ఈ సమస్యతో బాధపడే వారికి ఉదయం లేచిన వెంటనే దాదాపు 30 నిమిషాలు పాటు కీళ్లు పట్టి వచ్చినట్లు ఉండటం కనిపిస్తుంది పనిచేస్తున్న కొద్ది నెప్పి తగ్గుతుంది ఇలాంటి లక్షణం కనబడిన వెంటనే కలిసి తగు వైద్యం చేసుకుంటే పెరగకుండా ఉంటుందన్నారు. స్పాండిలో ఆర్థరైటిస్ గురించి తెలియజేస్తూ ఈ సమస్య వచ్చినప్పుడు వెన్నుపూసలు స్టిఫ్నెస్ వచ్చినట్లుగా అనిపించడం, నడవలేకపోవడం, మెడ తిప్ప లేకపోవడం కళ్ళు ఎర్రబడటం లాంటి లక్షణాలు కనబడతాయి ఇలాంటి లక్షణాలు కనబడిన వెంటనే రుమటాలజీ సమస్యగా గుర్తించా లన్నారు. ఫ్రోజెన్ షోల్డర్ గురించి వివరిస్తూ మన భుజం జాయింట్ వద్ద కండరాలు పట్టుకొని పోయినప్పుడు ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ లక్షణం కనపడిన సందర్భాల్లో అల్ట్రాసౌండ్ పరీక్ష చేయడం ద్వారా సమస్యలు తెలుసుకొని ఫిజియోథెరపీ విధానంలో చికిత్స ఇవ్వవచ్చు నన్నారు. లూపస్ సమస్య గురించి తెలియజేస్తూ ఈ సమస్య ఎక్కువగా ఆడవారిలో కనబడుతుందని నీరసం, జుట్టు రాలడం, నోటిలో పుండ్లు, చర్మంపై దద్దుర్లు, ఎర్రని మచ్చలు పోవడం లాంటి లక్షణాలు కనబడతాయి ఇలాంటి లక్షణాలను గుర్తించడం వెంటనే రుమటాలజిస్ట్‌ను సంప్రదించాలని అన్నారు. సభకు కోఆర్డినేటర్‌గా టి.వీ. సాయిరాం వ్యవహరించగా, గాయత్రి కో ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ టి.సుబ్బారావు, అనవేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

మాట్లాడుతున్న డాక్టర్ అలేఖ్య

పల్నాడులో పరిశ్రమల స్థాపనకు కృషి

గురజాల ఎమ్మెల్యే యరపతినేని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను గాలికి వదిలేసిందన్నారు. గురజాల నియోజకవర్గ అభివద్ధికి ఇప్పటికే రూ.1200 కోట్లు

మంజూరైనట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పల్నాడు ప్రాంతంలో రెండు కొత్త సిమెంట్ పరిశ్రమలు నెలకొల్పనున్నట్టు వెల్లడించారు. సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధితో రైతులు మూడు పంటలు పండించగలుగు తున్నారని పేర్కొన్నారు. చిన్నతరహా పరిశ్రమలకు అవసరమైన భూములు సైతం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగాల కల్పన సాదనకు కృషి జరుగుతోందన్నారు. డిఎస్‌సి ద్వారా 16 వేలమందికి ఉద్యోగాల కల్పనకు ఇప్పటికే పరీక్షలు పూర్తయ్యాయని తెలిపారు. వైసిపి గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీసిందని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి రాగానే పేదలకు పింఛన్లు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు ఇస్తున్నా మన్నారు. అన్నా క్యాంటీన్లు, రోడ్ల మరమ్మత్తుల ద్వారా బడుగు వర్గాలకు వెలుగు నింపినట్టు చెప్పారు. వైసిపి పాలనలో రైతుల సమస్యలను గాలికి వదిలేసి, గంజాయి సాగుకు ఎపిని అడ్డాగా మార్చారన్నారు. ఎన్నికల్లో ఘోర ఓటమి పాలైనా వైసిపి నాయకులు ప్రజలను నరుకుతాం...చంపుతాం అంటూ మాట్లాడు తున్నారని, వీరిని జగన్ సమర్థిస్తున్నారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని లాంటి నేతలు "దమ్ముంటే నరుకుతాం" అంటూ మాట్లాడుతున్నప్పుడు, వారికి అడ్డుగోలు ధైర్యం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. రాజకీయ విమర్శలు చేయొచ్చు గాని, హింసతో లబ్ధి పొందాలనుకోవడం తగదన్నారు. వైసిపి రెచ్చితే మేము రెచ్చిపోము, కాని ఎవరైనా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

సమస్యలపై అర్జీలు స్వీకరించిన మంత్రి

ప్రజాశక్తి తెనాలి

అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని ప్రజలు వివిధ సమస్యలపై ఆయనను కలిసి అర్జీలు సమర్పించారు. సమస్యలను వివరించారు. అర్జీలు స్వీకరించిన మంత్రి వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖల ద్వారా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్ డి ఎన్ యేసురత్నం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న మంత్రి మనోహర్

పేద కళాకారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కళాకారులును గౌరవించుకునే సంస్కృతిని కాపాడు కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రముఖ హరికథకులు నన్నపనేని సాంబశివరావు 10వ సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ వేదవతి, పి శివకుమారి హరికథ గానం వినిపించారు. సుప్రసిద్ధ అల్ ఇండియా రేడియో హరికథ భాగవతారిణి విన్నకోట రామకుమారి వినిపించిన భక్త మార్కండేయ హరికథ కాలక్షేపం శ్రోతలను అలరించింది. అనంతరం డివి సుబ్బారావు ప్రదర్శించిన హరిచంద్ర నాటకం శ్రోతలను ఆకట్టుకుంది. పలువురి పేద కళాకారులకు మంత్రి మనోహర్ ఆర్థిక సహాయం అందించారు. మంత్రి మాట్లాడుతూ కళాకారులును గౌరవించుకునే సంస్కృతిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయి నాటికలు నిర్వహించి కళాకారులను ఒకచోటికి చేరుస్తామన్నారు. కార్యాక్రమంలో నన్నపనేని రాంబాబు, వెంకటేశ్వరరావు, శివరామకష్ణ, తోటకూర రమణారావు, హరిదాసు గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందజేస్తున్న డాక్టర్ శ్రావణి

సాయిమంగా వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సమాజ సేవా చెయాలన్న సంకల్పంతో సాయిమంగా వెల్ఫేర్ సొసైటీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు సంస్థ వ్యవస్థాపకులు కంకిపాటి రమేష్ అన్నారు. స్థానిక నాజరుపేట సుజాత హెల్త్ క్లినిక్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో డాక్టర్ పి శ్రావణి వైద్య సేవలు అందించారు. రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. సొసైటీ వ్యవస్థాపకులు రమేష్ మాట్లాడుతు అమరావతి సర్జికల్ కార్పొరేషన్, సిటీ క్లినిక్ సంస్థలు తమ శిబిరానికి తోడ్పాటు అందించినట్లు తెలిపారు. శిబిరం ద్వారా రూ 80 వేలు విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. డాక్టర్ పి శ్రావణి మాట్లాడుతూ సుజాత హెల్త్ క్లినిక్ ద్వారా ప్రతిరోజు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని, అనారోగ్య బాధితులు సద్వినియోగపరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు హరిదాసు గౌరీ శంకర్ వైద్య శిబిరాన్ని సందర్శించి, శిబిరం ద్వారా పేదలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి సుధాకర్, సభ్యులు పూర్ణ, గోపి, శ్రీనివాస్, సుజాత హెల్త్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా 5న ధర్నా

జయప్రదం చేయాలని ప్రజలకు వామపక్షాలు, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపాలని వచ్చేనెల 5న వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిఐటియు కార్యాలయంలో వామ పక్షాలు, వివిధ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి రెడ్ బాషా తదితర నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలంటూ యువగళం పాదయాత్రలో చెప్పిన లోకేష్ ఇప్పుడు నోరుమెదపకపోవడం ప్రజల్ని మోసం చేయడమేనన్నారు. ట్రూ అప్ చార్జీలు అదనపు చార్జీలు, స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపుతో రానున్న రోజుల్లో విద్యుత్ రంగం మొత్తం అదానీ చేతుల్లోకి వెళుతుందని హెచ్చరించారు. వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు మంగళం పాడతారని సామాన్యులు విద్యుత్ బిల్లులు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడే పరిస్థితి దాపురిస్తుందన్నారు. ఇదే జరిగితే మరో విద్యుత్ ఉద్యమం తప్పదన్నారు. ఏడాది పాలనలో ప్రజలపై అదనపు ఇంధన సర్దుబాటు తదతర విద్యుత్ చార్జీల భారాలు గతేడాది ప్రజలపై వేసిన అదనపు భారాలు రూ.15,526 కోట్లు రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని, బిగించిన మీటర్లను తొలగించి పెంచిన విద్యుత్ సుంకాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. 2024-2025 లో అదనంగా వసూలు చేసిన రూ.2787 కోట్లను వెంటనే తిరిగి చెల్లించాలని కోరారు. బిజెపి ఒత్తిడితో గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు అదాని షిరిడిసాయి కంపెనీతో ఒప్పందం చేసుకోగా వామపక్ష, ప్రజా సంఘాలు పోరాడాయని గుర్తు చేశారు. దక్షిణాది రాష్ట్రాలు స్మార్ట్ మీటర్లు బిగించబోమని తేల్చి చెప్పాయని, కూటమి ప్రభుత్వం మాత్రం ముందుకెళ్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పట్టణాల్లో, గ్రామాల్లో దశలవారీ ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించారు. సిఐటియు జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, నాయకులు మల్లీశ్వరి, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జి.జాన్‌పాల్, సిఐటియు పట్టణ నాయకులు షేక్ సిలార్ మసూద్, పికెఎస్ జిల్లా నాయకులు కె.ఏడుకొండలు, ఎంసిపిఐ(యు) పల్నాడు డివిజన్ నాయకులు ఎం.నాగేశ్వరరావు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎం.రాంబాబు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, పిడిఎం నాయకులు ఎన్.రామారావు వివిధ సంఘాల నాయకులు టి.ఆంజనేయులు, శ్రీనివాసరావు, ఎ.ప్రసాదరావు, షేక్ రఫీ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రెడ్ బాషా

ఒరిగిన విద్యుత్ స్తంభంతో భయం..

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని కచేరి సెంటర్ మీ-సేవ కేంద్రం పక్కనే విద్యుత్ స్తంభం ఒరిగింది. ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఈ స్తంభం పక్కనే కొత్త స్తంభాన్ని ఆ శాఖ ఏర్పాటు చేసినా ఒరిగిపోయిన విద్యుత్తు స్తంభానికి ఉన్న సర్వీస్‌సు వైర్లను మాత్రం ఇంకా తొలగించలేదు. దీంతో ఆ స్తంభం పడిపోతే ప్రమాదమని స్థానికులు ఆందోళన పడుతున్నారు. ఈ రహదారి గ్రామంలో ప్రధానమైంది. లగడపాడు, కన్నెగండ్ల, గారపాడుకు వాహనాలు ఇదే మార్గంలో వెళ్తుంటాయి. దీన్ని గమనించి విద్యుత్ శాఖాధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోజు మార్చి రోజు వాన

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడులో రోజు మార్చి రోజు వర్షం పడుతోంది. ఆరు రోజుల నుండి పగలు విపరీతమైన ఎండ, పెద్ద ఎత్తున గాలులు వీస్తుండగా రాత్రివేళల్లో భారీ వర్షం పడుతోంది. వాన కూడా రోజుమార్చి రోజు వస్తుండడంతో వ్యవసాయ పనులు చేసుకోవడానికి వీలకావడం లేదని రైతులు చెబుతున్నారు. మొన్నటి వరకు అనావృష్టి ఇప్పుడు అతివృష్టి తీరుగా పరిస్థితి ఉందని అంటున్నారు.

చెస్‌తో ఏకాగ్రత

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

చెస్ వల్ల ఏకాగ్రత, చురుకుతనం పెంచటంతో పాటు మానసిక ఒత్తిడిని తట్టుకొని, మెదడుకు పదును పెట్టేందుకు ఎంతగానో దోహదపడుతుందని మండల విద్యాశాఖ అధికారి అల్లి సురేష్ అన్నారు. అంతర్జాతీయ చదరంగం దినోత్సవం సందర్భంగా స్థానిక కోదండరామ దేవాలయంలో ఆదివారం వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కిరణ్ నేతృత్వంలో జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌ను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ మాట్లాడుతూ చిన్నారులను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచుతూ మెదడుకు మేతనిచ్చే చదరంగాన్ని నేర్పిస్తూ వారిలోని ప్రతిభను వెలుగు తీసేందుకు క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయమని అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు, చక్రధర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కుర్రి సాయిమార్కొండారెడ్డి మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో ఇలాంటి క్రీడలను మనం ఎంతగానో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పోటీల్లో ప్రథమ బహుమతి సంజీవ్ నాయక్, ద్వితీయ బహుమతి దీక్షిత, తృతీయ బహుమతి కెవెన్ మోజెస్‌తో పాటు పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేశారు. అనంతరం చెస్ కిరణ్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దశరథన్, వాసవి క్లబ్ జోనల్ చైర్మన్ ఒరుగంటి చెన్నకేశవరావు, పాస్ట్ రీజన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు అధ్యాపకులు ఆవుల ఆంజనేయులు పాల్గొన్నారు.

వాననీరు, మురుగునీరు కలిసి ఇళ్లల్లోకి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రమైన ముప్పాళ్లలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వానల నేపథ్యంలో వర్షపునీటితోపాటు సైడు కాల్వల్లోని మురుగు రోడ్లపై ప్రవహించి ఇళ్లల్లోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామంలో ఫాగింగ్ గానీ తాగునీటి బావులలో క్లోరినేషన్ గానీ చేసిన దాఖలాలు లేవు. రోజూఇళ్ల వద్ద నుంచి సేకరించిన చెత్త వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించకుండా ఊరి చివర రోడ్డు వెంబడి వేస్తున్నారు. ఇటీవల రోడ్ల వెంబడి చెత్తను తొలగించకుండా పొక్లెయినర్ ద్వారా అక్కడి చెత్తను అక్కడే వెనుకకు నెట్టారు. దీనివల్ల స్థానికులకు రోగాల ప్రమాదమూ పొంచి ఉంది. పారిశుధ్యం అధ్వానంగా ఉన్నప్పటికీ పనులు మాత్రం చేయించినట్లు రికార్డుల్లో నమోదు చేసి నిధులు డ్రా చేస్తున్నారనే ఆరోపణలువస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని, పారిశుధ్యంపై కాస్తంత దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మోకాళ్లు, ఒంటికాలిపై నిలబడి నిరసన

8వ రోజు కొనసాగిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల, సత్తెనపల్లి

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారమూ కొనసాగింది. ఇందులో భాగంగా పిడుగురాళ్లలో ఒంటికాలిపైన, సత్తెనపల్లిలో మోకాళ్లపైన నిలబడి కార్మికులు నిరసన తెలిపారు. సమ్మె శిబిరాల వద్ద సిఐటియు పిడుగురాళ్ల మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, సత్తెనపల్లి పట్టణ కన్వీనర్ జె.రాజ్‌కుమార్ మాట్లాడారు. 8 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, స్కిల్డ్, సెమీస్కిల్డ్ ప్రకారం వేతనాలు నిర్ణయించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. షరతులేమీ లేకుండా సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, 12వ పిఆర్సి ప్రకారం వేతనాలు చెల్లించాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. చనిపోయిన కార్మికుల స్థానాంలో వారి కుటుంబీకులకు అవకాశంకల్పించాలన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని ఉద్ఘాటించారు. పిడుగురాళ్ల సమ్మె శిబిరంలో గన్నెపూడి విజయ్ ,పూర్ణ చంద్రరావు, సుభాని, విజయ సారథి, సురేష్, మొగిలి నాగేశ్వరరావు, వాసా ప్రతాపు, కంప సాగర్‌బాబు, గద్దె శ్రీనివాసరావు, మొగిలి ప్రతాప్, దేవరకొండ మార్తమ్మ, ఏదుల లక్ష్మి, చల్లా పద్మ, మొగిలి నాగేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వర్లు, దేవుళ్ళ చిన్న వెంకటేశ్వర్లు, బెక్కంటి రామయ్య, తిరుపతిరావు, కొమర గురవయ్య పాల్గొన్నారు. సత్తెనపల్లి సమ్మె శిబిరంలో సిహెచ్ వెంకయ్య, చంద్రకళ, జల్లి రమేష్, సిహెచ్ సునీత, దుర్గ, కుమార స్వామి, జానీ, థామస్ ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మున్సిపల్ వర్కర్స్-ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 8వ రోజుకు, పారిశుధ్య కార్మికులు సమ్మె 5వ రోజుకు చేరుకున్నాయి. నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడాన్ని నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వం సత్వరం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలప్పుడు కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతుతోపాటు హామీలిచ్చిన కూటమి వాటిని విస్మరించి మోసం చేసిందన్నారు. చాలీచాలని వేతనాలతో కార్మికులు జీవనం సాగించలేక మైక్రోఫైనాన్స్ సంస్థల వద్ద అధిక వడ్డీల అప్పులు తీసుకుని తీర్చలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు షేక్ చిన్న అల్లాబక్షు, సోమశేఖర్, కె.శ్రీను, బాలాజీసింగ్, బి.శ్రీను, కిరణ్కుమార్, మురళి, సామ్రాజ్యం, వెంకట్, వాసు, ఖాదర్, గౌస్, మాలిక్, సురేష్, రంగనాయకులు, కోటేశ్వరావు, షేక్ ఖాన్, పారిశుధ్య కార్మికులు సల్మాన్, వీరకుమార్, మల్లయ్య, యోహాన్, ఏసు, జీవరత్నం, విజయలక్ష్మి, ప్రసాద్, నరసింహారావు, జాన్ పాల్గొన్నారు.

నరసరావుపేట సమ్మె శిబిరంలో కార్మికులు

కార్మికులకు వెల్లువెత్తుతున్న మద్దతు

మంగళగిరి సమ్మె శిబిరంలో మాట్లాడు తున్న సిఐటియు నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య

ఎనిమిదవ రోజు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - మంగళగిరి

ఇంజనీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, ఇతర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె ఆదివారం నాటికి ఎనిమిదో రోజు చేరింది. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, ఏఐఎఫ్‌టియూ న్యూ నాయకులు కే కోటేశ్వరరావు మాట్లాడుతూ న్యాయమైన కోరికల కోసం చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలియజేశారు. ఎనిమిది రోజులు అవుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. వెంటనే మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కలగజేసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని అన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎం శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, వి శ్రీనివాస రావు, కే గోపి, కేదార్నాథ్, ప్రకాష్, సాంబశివరావు, రమణయ్య, దుర్గారావు పాల్గొన్నారు.

ఎర్రబాలెంలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న వైసిపి నాయకులు

సమ్మెకు వైసిపి సంఘీభావం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఎర్రబాలెంలో 8 వ రోజు కు చేరుకుంది. ఆదివారం జరిగిన నిరసన కార్యక్రమం నాకు వైసీపీ నేతలు సంఘీభావం తెలిపారు. అనంతరం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎంటిఎంసి రాజధాని ప్రాంత గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. సమస్య పరిష్కారానికి మున్సిపల్ యంత్రాంగం, మంత్రి చొరవ చూపాలనీ డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల కు జీవో నెంబర్ 36 ను అమలు చేసి జీతాలు పెంచాలని కోరారు. జీవో నెంబర్ 26 ప్రకారం మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె నేటికీ ఎనిమిదో రోజుకు చేరినప్పటికీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదనన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు జరపమని కార్మికులు కోరుతున్నారని ఇచ్చిన హామీలు అమలు జరపకుండా మాట తప్పడం వలనే సమ్మె జరుగుతున్నారు. సమ్మె కొనసాగుతున్నప్పటికీ పరిష్కారానికి మున్సిపల్ మంత్రి ,యంత్రాంగం చొరవ చూపించకపోవడం ఏమాత్రం సరైనది కాదన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెత్త పేరుకుపోయి ప్రజలు అనారోగ్యాల పాలు కాకముందే ప్రభుత్వం మేలుకోవాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం పెంచబోతున్న పని గంటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ సిపి నాయకులు డాక్టర్ ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల చేస్తున్న సమ్మెకు వైసిపి పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా వారి జీతాలు వెంటనే పెంచాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు సంఘీభావం తెలిపిన వారిలో ఎర్రబాలెం వైసిపి అధ్యక్షులు లేళ్ల శివ, నాయకులు షేక్ బడే మియా, దానబోయిన నాగయ్య, ఆకుల శంకర్, షేక్ షఫీ, దాసరి ప్రియా, నందం షేక్ గౌస్ తదితరులు ఉన్నారు. సమ్మెలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు టి బాబు, రామారావు, టి ఆదిలక్ష్మి, కే కోటేశ్వరి, ఎం పార్వతి, ఎన్ దివ్య, రమాదేవి, ఎస్కే కరిముల్లా, చనుమోలు కోటేశ్వరరావు, చిన్న శీను, ఏడుకొండలు, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాజ లో వంటావార్పుతో వినూత్న నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం వినూత్న రీతిలో కాజా గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన కార్యక్రమం లో భాగంగా పంచాయతీ కార్యాలయం ఎదుట వంట వార్పు చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడారు. చిన్న చిన్న ఉద్యోగులపై కార్మికులపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో నిరసనలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

కార్మికుల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

మున్సిపల్ కార్మికులు చేస్తున్న న్యాయమైన సమ్మెను, సహేతుకమైన వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించి సమ్మెను విరమింప చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు కోరారు. సమ్మెలో భాగంగా తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలను వెంటనే అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచాలని నినాదాలు చేశారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో పాటు ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమస్యలు కూడా పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, డి వెంకట్ రెడ్డి, మేస్త్రి శ్రీనివాసరావు, డేవిడ్, మరియమ్మ, సంతోషం, కొండయ్య పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న బాబు ప్రసాద్

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తెనాలి :మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి కె బాబు ప్రసాద్ ఆదివారం సందర్శించి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వారి వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వారి కుటుంబాలకు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, టిఎస్ కిరణ్ కుమార్, డి శ్రీధర్, పి. చక్ర వర్తి, జి. గోపి సిహెచ్ దిలీప్ కుమార్, షేక్ కరిముల్లా, ఎం. ప్రదీప్ కుమార్, వై అశోక్, కె. ప్రశాంతి, ఎం సునీల్ కుమార్, ఖాసిం పాల్గొన్నారు.

సన్మాన కార్యాక్రమంలో పాపినేని, పెనుగొండ,ఫౌండేషన్ నిర్వాహకులు

సాహితీ దిగ్గజాలు ఆలూరి బైరాగి, శారద నటరాజన్

ఘనంగా తెనాలిలో శతజయంతి సభ

ప్రజాశక్తి - తెనాలి

సాహితీ ప్రపంచంలో తమ రచనలు, సాహిత్య పటిమతో ఆలూరి బైరాగి, శారద నటరాజన్ దిగ్గజాలుగా వెలుగొందారని ప్రఖ్యాత తెలుగు రచయిత యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వడ్లమూడి గోపాలకృష్ణ, వడ్లమూడి వెంకట లక్ష్మమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆలూరి బైరాగి, శారద నటరాజన్ శతజయంతి సభ నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ సాహిత్య సృజనలో వేనోళ్ళ కొనియాడబడిన రచయిత ఆలూరి బైరాగి అని చెప్పారు. తెలుగు వాడు కాకున్నా కేవలం సాహిత్యం కోసం తెలుగు నేర్చుకుని సాహితీ ప్రపంచమే జీవితం గా గడిపిన గొప్ప వ్యక్తి శారద నటరాజన్ అని కొనియాడారు. కలల కాణాచి తెనాలిలో సాహితీ దిగ్గజాల శత జయంతి సభ నిర్వహించటం తెనాలి కళావైభవానికి ప్రతీకగా చెప్పారు. రెండు విభాగాలుగా నిర్వహించిన సాహితీ సదస్సులో 'ఆలూరి బైరాగి జీవితం రచనలు' అంశంపై సుప్రసిద్ధ తెలుగు రచయిత పాపినేని శివశంకర్ మాట్లాడుతూ తెలుగు సాహితీ రంగంలో ద్వితీయ సహస్రాబ్ది మహాకవి అనిపించుకున్న ఘనత ఆలూరి బైరాగి కే దక్కుతుందన్నారు. 'శారదా నటరాజన్ జీవితం రచనలు' అంశంపై కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ శారదా నటరాజన్ బతుకుదెరువు కోసం హోటల్ కార్మికునిగా ఉంటూనే, శారద కలం పేరుతో వందకుపైగా రచనలు చేశారని, సాహితీ లోకంలో గొప్ప రచయితగా వెలుగొందారని కొనియాడారు. సభలో శారద నటరాజన్ కుమార్తె శారద, ఆచార్య గుజ్జర్లమూడి కపా చారి, తెలుగు సలహా మండలి సభ్యులు వల్లూరి శివప్రసాద్, కొత్తపల్లి రవిబాబు, కందిమళ్ళ శివప్రసాద్, పిఎస్ చంద్రశేఖర్ ప్రసంగించారు. కార్యక్రమంలో చెరుకుమల్లి సింగారావు, షేక్ అబ్దుల్ హకీమ్ జానీ, వడ్లమూడి వెంకటలక్ష్మి ఫౌండేషన్ కోశాధికారి తుమ్మల కిషోర్ బాబు, గరికపాటి సుబ్బారావు, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ తరపున అతిథులను డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి సారథ్యంలో సత్కరించారు.

హోటల్ ప్రారంభిస్తున్న జొన్నా శివశంకరరావు

అమృత హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి- తాడేపల్లి

ఉండవల్లి సెంటర్లో వంశీ హైస్కూల్ ఎదురుగా సిపిఎం కార్యాలయం పక్కన ఆదివారం నూతన ప్రాంగణంలో అమృత హోటల్ పునః ప్రారంభం ఉండవల్లి మాజీ హాట్రిక్ సర్పంచ్, రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర రావు ప్రారంభించారు. వంశి హైస్కూల్ అధినేత తక్కెలపాటి పాపిరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త సింగంశెట్టి వెంకటేశ్వరరావు, జొన్న అంజయ్య కర్రీ పాయింట్, టీ స్టాల్‌ను ప్రారంభించారు. ప్రొప్రైటర్ జొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటు ధరలలో శుభ్రమైన అత్యంత రుచికరమైన ఆహారాన్ని అందజేస్తామని అన్నారు. అమృతహోటల్ అల్పాహారానికి చాలా ఫేమస్ అని.. వాటిని కొనసాగిస్తూనే మార్నింగ్ వాకింగ్ చేసేవారికోసం రాగి జావ, కోడిగుడ్డు మధ్యాహ్నం చేపల పులుసు,నాటుకోడి కూర, బిర్యానీలు, ఫ్రైడ్ రైస్, రుచికరమైన శాఖాహార మాంసాహార భోజనాలు, ప్రజలకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. 50 నుంచి 70 మంది వరకు కూర్చొని తినే విధంగా సదుపాయాలు కల్పించామని. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

గుంటూరు జిల్లా కోర్టులో గుంటూరు జిల్లా జ్యుడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ నకు గుంటూరు జిల్లా కోర్టునకు వచ్చిన గుంటూరు జిల్లా పోర్టు పోలియో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయ సూర్యని మర్యాదపూర్వకంగా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ కార్యవర్గ సభ్యులు కలిశారు. కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ నాలుగవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘ అధ్యక్షులు రామరాజు చంద్రశేఖర్, గుంటూరు నగర శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రాచకొండ శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులు పోతు పాలెపు సాంబయ్య, సంయుక్త కార్యదర్శి పాలడుగు పుల్లారావు ఇతర కార్యవర్గ సభ్యులు కలిసిన వారిలో ఉన్నారు

దశాబ్దాల నాటి చెట్లు నరికివేత

మొన్న విశ్వనాథ సినిమా హాలువద్ద - నేడు మార్కెట్‌యార్డులో

అధికారులే వాల్టా చట్టాలను ఉల్లంఘిస్తే...

నరికివేసిన మర్రి, వేప చెట్టు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

బహిరంగంగా చెట్లను నరికి కలపను అధికారుల సమక్షంలోనే తరలిస్తున్నా ఏ అధికారీ పట్టించుకోకపోవటం బాధాకరం. వృక్షో రక్షతి రక్షిత అన్న సూక్తి పట్టణంలో ఎక్కడా అమలు కావడం లేదు. మొన్న పట్టణ నడిబొడ్డున విశ్వనాథ్ సెంటర్ సినిమా హాలు ఎదురుగా ఉన్న భారీ రావి చెట్టును, నేడు వ్యవసాయ మార్కెట్‌యార్డులోని సంవత్సరాలనాటి మర్రి, వేప చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా అధికారులు నరికి వేశారు. కలపను తరలించారు. పట్టణంలో మండల, నియోజకవర్గ స్థాయిలో ఎక్కడా కొత్తగా మొక్కలు నాటడం లేదు సరికదా కనీసం మొక్కల పెంపకం గురించి ప్రజలకు అవగాహన కల్పించకపోవడం బాధాకరం. ప్రభుత్వం మొక్కలు నాటండి.. చెట్లను పరిరక్షించండి అంటూ చెబుతుంటే ఏకంగా యార్డు కార్యదర్శి చెట్లను నరకండి..వాటిని తొలగించండి అంటూ ముందుకు సాగటం ఆశ్చర్యంగా ఉంది.

ట్రాక్టర్‌లో మార్కెట్ యార్డు నుంచి తరలిస్తున్న కలప

దశాబ్దాల చరిత్ర గల చెట్లపై వేటు

స్థానిక పాత మార్కెట్ యార్డులో దశాబ్దాల చరిత్ర కలిగిన పెద్ద చెట్లు ఉన్నాయి. యార్డుకు వచ్చిన రైతులు ఈ చెట్ల నీడన, యార్డు ప్రహరీ మీద సేదతీరే వారు. ముఖ్యంగా వేసవిలో ఈ చెట్లు చల్లని నీడతో పాటు గాలిని ఇచ్చేవి. ఏళ్ల నాటి చెట్లను మార్కెట్ కార్యదర్శి అడ్డమొస్తున్నాయనే వంకతో నరికించారు. యార్డు కార్యదర్శి తిరుపతి రాయుడి మాటల్లో... మార్కెట్ యార్డులో పలు భవనాలపై చెట్టు కొమ్మలు వాలుతుండడంతో భవనాలకు ప్రమాదం కలుగుతుందని నరికించామని చెప్పారు.

చెస్ బోర్డులను అందజేస్తున్న కమిషనర్ వేణుబాబు

చెస్ క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - మాచర్ల

అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పల్నాడు చెస్ అకాడమీ సహకారంతో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ సేవ సమితి కేంద్రానికి చెస్ క్రీడాసామగ్రిని బహూకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాచర్ల మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు మాట్లాడుతూ పల్నాడు చెస్ అకాడమీ సహకారంతో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో చెస్ పోటీలు నిర్వహిస్తున్న చెస్‌మాస్టర్ కిరణ్‌ను అభినందించారు. రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ గతంలో చెస్ ఆడాలంటే గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ విశాఖపట్నంకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు మాచర్లలో చెస్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ జోన్ చైర్మన్ ఒరుగంటి చెన్నకేశవరావు, పాపిరెడ్డి మాస్టర్, వీరాంజనేయులు మాస్టర్, జర్నలిస్ట్ పాపారావు పాల్గొన్నారు.

కవి కరీముల్లాకు సత్కారం

ప్రజాశక్తి - వినుకొండ

హిందూపురంలో భారతీయ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి కరీముల్లాకు తిరుపతి వేంకట కవులు సాహిత్య పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. వక్తలు కరీముల్లా సాహిత్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గజల్ శ్రీని వాస్, ప్రముఖ ఎడిటర్లు వైయస్ఆర్ శర్మ, బిక్కి కృష్ణ, విమల సాహితీ జనార్దన్, జర్నలిస్టులు, కవులు, రచయితలు పాల్గొ న్నారు. వారు మాట్లాడుతూ కరీముల్లా రాసిన పుస్తకాలు తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడిని సృష్టించి తెలుగుభాషకు సరికొత్త సొగసులద్దాయని తెలిపారు. అబాబీలు అనే నూతన వచన కవితా ప్రక్రియ ఆవిష్కరించిన కరీముల్లా కవులకు మార్గనిర్దేశకులయ్యారని ప్రశంసించారు.

రూ. 100 కోట్లకు పైగా అభివృద్ధి

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గంలో రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం మండలంలోని బుచ్చియ్యపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆ గ్రామ టిడిపి నాయకులు పరుచూరి నాని ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మండల టిడిపి అధ్యక్షులు వై.బ్రహ్మయ్య,గోపాలరావు, సర్పంచ్ వీరసింహం పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు ఎమ్మెల్యే

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రభుత్వ పాఠశాల్లో చదివిన చాలా మంది శాస్త్రవేత్తలుగా దేశానికి సేవలందిస్తున్నారని ఆ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తల్లిదండ్రులకు సూచించారు. ఆదివారం సత్తెనపల్లి పట్టణంలోని కాకతీయ కళ్యాణ మండపంలో కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన 84 మంది విద్యార్థులకు రూ.11లక్షల15వేల ఉపకార వేతనాలు అందజేశారు. మాజీ మేయర్ కన్నానాగరాజు ఆర్వీఎ జీ రమణ కాంతరెడ్డి టిడిపి పట్టణ అధ్యక్షులు మస్తాన్‌వలీ మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ల అమరేశ్వరరావు టిడిపి నాయకులు యెలినేడి రామస్వామి దరువూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులకు సాగునీరు

ఎర్రబాలెం మేజర్ కాల్వకు మరమ్మతులు : టిడిపి

ప్రజాశక్తి - బెల్లంకొండ

గడచిన ఐదేళ్లలో గత ప్రభుత్వం చేయని, చేయలేని పనులన్నీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో పరుగులు పెడుతున్నాయని బెల్లంకొండ మండల తెలుగుదేశం పార్టీ నాయ కులు అన్నారు. చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందాలంటే గతంలో నానా తిప్పలు పడేవారు. కాలవలకు మరమ్మ తులు చేయకపోవడం వల్ల ఎక్కడికక్కడే గండి పడి చివరి రైతులకు సరిగ్గా నీరు అందేది కాదు. దీని వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుల కారణంగా చివరి ఆయకట్టు వరకు సకాలంలో పుష్కలంగా నీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గడచిన ఐదేళ్లలో కాలువ పూడిక తీత పనులు చేపట్టిన దాఖలాలు లేవని, ప్రస్తుత ప్రభుత్వం ఈ పనులకు శ్రీకారం చుట్టిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎర్రబాలెం మేజర్ కాలువ చైర్మన్ మాచర్ల ముస్తఫా, (డికాటి) నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ గోవింద్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పిఎస్‌కె మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ గ్రామ సర్పంచ్ గడ్డి పర్ణి జ్యోతి, సముద్ర, వైస్ ప్రెసిడెంట్లు కొండవీటి అబ్దుల్ రజాక్, సయ్యద్ జానీ, మునగపాటి సుభానీ, కొండవీటి పెద్ద హుస్సేన్, నిడమానూరి పిచ్చయ్య, బెల్లంకొండ గ్రామ పార్టీ ప్రెసిడెంట్ అబ్దుల్ మజీద్, గుడిసె కొండయ్య, ఇరిగేషన్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

పెరగనున్న పత్తి, శనగ పంటలు

కానరాని మిర్చి, పొగాకు సాగు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మిర్చి, పొగాకు సాగుకు రైతులు ఒక విధంగా మండల స్థాయిలో క్రాప్ హాలిడే ప్రకటించారు. మిర్చి, పొగాకు నారుమళ్ల కనుచూపు మేర ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ఇదే పొగాకు పోయిన యేడాది 5500 ఎకరాలు, మిర్చి 2300 వందల ఎకరాలలో సాగైంది. ఒకవేళ ఆ పంటలనే ఈ యేడాది కూడా సాగు చేస్తే గ్రామాలలో పదుల సంఖ్యలోను, మండల స్థాయిలో వందల ఎకరాలు ఉండొచ్చు. నాలుగైదు రోజులుగా రుతుపవనాలు ప్రభావం వల్ల ఉదయం, సాయంత్రం కొంచెంసేపు కురుస్తున్న వర్షాలకు మండల రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. పోయిన యేడాది మండలంలో పత్తిసాగు షుమారుగా 2300 వందల ఎకరాలలో సాగు చేశారు. ఈ సంవత్సరం 3 నుంచి 4 వేల ఎకరాల్లో సాగు కానుంది. ప్రస్తుతం ఇప్పటికి 500 నుంచి 700 వందల వరకు పత్తి సాగు చేశారు. మిర్చి విత్తనాలు అడగటం లేదని ఇప్పటికే దాదాపు 80శాతం రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు చేశారని విత్తనాల షాపుల వారు అంటున్నారు. ఈ లెక్కన ఈ యేడాది పత్తిసాగు విస్తారంగా పెరుగుతుందంటున్నారు.

పొలాన్ని సాగుకు సిద్ధం చేసుకున్న పత్తి రైతులు

పత్తి విత్తనాల రేట్లు పెరగక పోవటం, కౌలు తక్కువగా ఉండటం, ఇంకా సమయంమించక పోవటమే కాక పత్తి తరువాత అక్టోబర్ చివర నవంబర్ మొదటి వారంలో ఈ పంటను తీసివేసి మొక్కజొన్న సాగు చేయవచ్చనే ఆలోచనలో ఉన్నట్లు రైతులు చెప్తున్నారు. కాబట్టి రైతులు పత్తి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారనడంలో సందేహం లేదు. ప్రస్తుతం పోయిన సంవత్సరం రేట్లు ఈ సంవత్సరం అమ్మకాలు చేయడంతో విత్త నాలు 470 గ్రాముల ప్యాకెట్ రూ.750, 800లకు అమ్ముతున్నారు. ఎకరాకు రెండు పాకెట్లు సరిపోతాయి. పత్తికి ఈ సంవత్సరం ప్రభుత్వం మద్దతు ధర రూ.8100లు ప్రకటించారు. పోయిన సంవత్సరం మద్దత్తు ధర రూ.7730లుగా ఉంది. ప్రయివేటుగా కూడా పత్తి పోయిన సంవత్సరం రూ.6500 నుంచి రూ.7000వరకు అమ్మకాలు జరిగాయి.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జడ్పీహెచ్ హైస్కూల్‌లో ఆదివారం కాటూరి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రముఖ వైద్యులు కొరారు సత్యనారాయణ, టిడిపి నేత దరువూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రెంటపాళ్ల పరిసర ప్రాంతాల ప్రజలు తరలి వచ్చారు. వైద్యులు 340మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాటూరి ఆసుపత్రి వైద్యులు టిడిపి నాయకులు కోమటినేని శ్రీనివాసరావు మొక్కపాటి రామ చంద్రయ్య లక్ష్మీనారాయణ గ్రామపెద్దలు, ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు కుంచనపల్లి కిరణ్ కొండవీటి ప్రసాద్ ఏపూరి సుబ్బారావు పాల్గొన్నారు.

బోనాల సంబరాలు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని నిమ్మల బావి బజారులోని రజక సోదర సోదరీమణుల ఆధ్వర్యంలో మార్కాపురం రోడ్డులో ఉన్న పసుపులేరు వాగువద్ద గంగమ్మతల్లికి, నిమ్మల బావి బజారులో ఉన్న ఎల్లమ్మ తల్లికి తీవ్రమైన వర్షాభావ పరిస్థి తులు కారణంగా స్థానిక రజక సోదర సోదరీమణులు బోనాలు సమర్పిస్తూ ఆ తల్లులను శాంతింప చేస్తూ వర్షాలు సమృద్ధిగా కురవాలని బోనాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చు కున్నారు. కార్యక్రమంలో స్థానికంగా ఉన్న రజక సోదరులు, భక్తులు సంతోషంగా పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని 17వ వార్డుకు చెందిన రాచుమల్లు నగర్‌వాసులు తమకు కనీస మౌలిక వసతులు కల్పించాలని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును కోరారు. ఆదివారం వారు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. గవర్నమెంట్ హాస్పిటల్ పడమర వైపున ఉన్న రోడ్డును అభివృద్ధి చేసి సిమెంట్ రోడ్డు, సైడు కాలు వలు, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని సమర్పించారు. స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ వీలైనంత త్వరగా మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లోక్ సత్తా పార్టీ నాయకులు మాదాసు భాను ప్రసాద్, కాలనీవాసులు రమేష్, ప్రసాద్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

డాక్టర్ ఐలా శ్రీనివాస్

వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట శకుంతల జనరల్- గ్యాస్ట్రో-లివర్ కేర్ హాస్పిటల్ (డాక్టర్ దత్తు హాస్పిటల్) అధినేత ప్రముఖ జనరల్-జీర్ణకోశ-లివర్ వైద్య నిపుణులు ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్ ఐలా శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చిలకలూరిపేట మండలంలో లింగంగుంట్ల గ్రామంలో తమ హాస్పటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 120 మందికి పైగా గ్రామస్తులకు బిపి, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ వ్యాధులతో పాటు గ్యాస్ట్రో, లివర్ పరీక్షలు నిర్వహించి ఉచి తంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సరైన ఆహార నియమాలు, సమయపాలన పాటించడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. తమ హాస్పిటల్‌లో అత్యాధునిక పరికరాల సౌకర్యంతో అన్ని రకాల ఎండోస్కోపి, కొలనోస్కోపి పరీక్షలు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహానగరాలకు ధీటుగా నరసరావుపేటలో కోత, కుట్టు లేకుండా ఇఆర్‌సిపి ద్వారా మెరుగైన చికిత్స తమ ప్రత్యేకత అన్నారు. హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు పట్ల డాక్టర్ శ్రీనివాస్ కు, సిబ్బందికి గ్రామ పెద్దలు, సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న అతిథులు

షార్ట్‌హ్యాండ్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

జీ టీవీ రమణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ షార్ట్ హ్యాండ్ వారి ద్వితీయ వార్షికోత్సవం మంగళగిరి సీకే జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇనిస్టిట్యూట్‌లో ఉచితంగా కోచింగ్ తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జి. హనుమంతరావు, జివిఆర్ ఆచార్యులు, రఘునాథాచార్య వేదిక్ ట్రస్ట్ అధ్యక్షులు జిఎస్ఆర్ వరదాచార్యులు, మాధవి టైప్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పి.మురళి, జి.వి.ఆర్ హిందీ పరిషత్ సెక్రెటరీ కె.వాసుదేవనయనార్, ఇంగ్లీషు అధ్యాపకురాలు యం. సువర్చల దేవి పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్స్ తేదీ పొడిగింపు

ప్రజాశక్తి - తాడికొండ

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించబడుతున్న డిప్లొమా కోర్సులకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్న వారికి వెబ్‌ఆప్షన్స్ నమోదు చేసుకునేందుకు ఈనెల 25 వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరానికి తిరుపతిలో అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అనుమతించినట్లు పేర్కొన్నారు. తిరుపతి డిప్లమా కళాశాల విద్యార్థులు 2025-26 సంవత్సరము ప్రవేశానికి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకునే అవకాశము కల్పించారని తెలిపారు. మరిన్ని వివరాలకు angrau.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ప్రయాణీకుడికి లగేజీ అప్పగింత

ప్రజాశక్తి - తెనాలి

రైలు ప్రయాణంలో అనుకోకుండా పోగొట్టుకున్న లగేజిని తిరిగి ప్రయాణీకుడికి రైల్వే పోలీసులు అప్పగించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం అమతలూరు మండలం పెదపూడి గ్రామానికి చెందిన సురేంద్ర శనివారం బెంగళూరు నుంచి విజయవాడ వెళ్లే రైలులో ప్రయాణించారు. వాస్తవానికి సురేంద్ర తెనాలిలో దిగాల్సి ఉంది. కానీ రైలుకు తెనాలిలో హాల్టు లేదు. రైలు తెనాలి స్టేషన్ సమీపంలోకి రాగానే సిగ్నల్ లేని కారణంగా నిదానించింది. ఆ సమయంలో రైలు నుంచి దిగేందుకు ప్రయత్నించిన సురేంద్ర ముందుగా తన లగేజ్‌ని కింద పడేసాడు. తను దిగటానికి ప్రయత్నించే లోగా రైలు బయలుదేరటంతో దిగలేకపోయాడు. విజయవాడ దిగిన అనంతరం తిరిగి తెనాలి రైల్వే పోలీసుల వద్దకు వచ్చి విషయం తెలియజేయడంతో అప్పటికే స్వాధీనం చేసుకున్న లగేజ్‌ని సురేంద్రకు అప్పగించారు. ఈ సందర్భంగా జిఆర్‌పి పోలీసులకు సురేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలో ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పోస్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పోస్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు టి.శ్రీనివాసరావు, కాకతీయ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ డిఎల్ కాంతారావు అధ్యక్షతన జరిగిన శిబిరంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) వారాహి మాతకు జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపి ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ దేగల ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుంటూరు ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఏ.అన్వేష్, డాక్టర్ కె.సాయిరాజశేఖర్, వైద్యులు డాక్టర్ తేజస్వి జల్లేపల్లి, డాక్టర్ సి. జగదీష్, డాక్టర్ బి.పవన్ కుమార్, డాక్టర్ సురేష్, డాక్టర్ జ్యోత్స్న ప్రియాంక, డాక్టర్ మాధవిలత పాల్గొన్నారు. గ్రామీణ పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందించే లక్ష్యంగా పోస్ట్ సంస్థ చేస్తున్న ఔదార్యం మరువలేనిదని దేగల ప్రభాకర్ తెలిపారు. శిబిరంలో 200 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ప్రైమ్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ శేషం ప్రదీప్ తెలిపారు.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - పెదకాకాని

ఏళ్ల తరబడి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనమర్లపూడి, తంగెళ్ళ ముడి గ్రామ ప్రజలు వర్షం వస్తే పడుతున్న ఇబ్బందుల గురించి ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. గుంటూరు పార్లమెంట్ సభ్యులు, కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గొల్లమూడి-ఉప్పలపాడు గ్రామాల మధ్య ఉన్న వాగు పొంగటంతో గత యేడాది కారులో ప్రయాణిస్తున్న తండ్రి, ఇద్దరు కొడుకులు కొట్టుకుపోయి మృతిచెందిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని రూ.1.20 లక్షలతో ఆ ప్రాంతంలో నూతన

శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దశాబ్దాలుగా రోడ్లకు నోచుకోని తంగెళ్ళమూడి, అనమర్లపూడి గ్రామాల్లో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నంబూరు కంతేరులో కొత్తరోడ్లు వేసేందుకు శంకుస్థాపన చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్మశాన వాటిక పరిరక్షణకు చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం ప్రతినిధులు

ప్రజాశక్తి - మంగళగిరి

నగరంలోని ముస్లిం శ్మశాన వాటిక (ఖబర్ స్థాన్) పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వివిధ జమాత్‌లకు చెందిన ముస్లిం ప్రతినిధులు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ జనాబ్ షేక్ అబ్దుల్ అజీజ్, డైరెక్టర్ షేక్ అక్రమ్, గుంటూరు నగర తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్‌కు ఆదివారం వినతి పత్రాలను అందజేశారు. మంగళగిరి నగరంలో రెండు వందల సంవత్సరాలుగా ఉన్న ముస్లిం శ్మశాన వాటికను రహదారి విస్తరణ పేరుతో కొంత భాగాన్ని తొలగించాలన్న మున్సిపాలిటీ ప్రతి పాదనపై తాము తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ముస్లింల జనాభా మూడువేల మంది ఉన్నప్పటి నుండి (ప్రస్తుతం 50వేలకు పైగా పెరిగింది) ఈ శ్మశానవాటికనే ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఈ ఖబర్ స్థాన్ వక్ఫ్ బోర్డు నోటిఫై చేసిన స్థలం కావడంతో దీని పరిరక్షణ కూడా వక్ఫ్‌బోర్డు బాధ్యతగా తీసుకోవాలని వారు కోరారు. వాస్తవానికి నగరపాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన తెనాలి రోడ్డులో అనేక మలుపులు ఉండటంతో ఇది విస్తరణకు ఎంతమాత్రం అనుకూలం కాదని, అందులో పలు మతపరమైన ప్రదేశాలు ఖబరస్తాన్, దేవాలయాలు, చర్చి ఉన్నందున అన్ని మతాలకు చెందిన వారి మనోభావాలు, విశ్వాసాలు దెబ్బతినే అవకాశం ఉందని ముస్లిం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలి రోడ్డును వన్‌వేగా చేసి, జాతీయ రహదారిని నేరుగా కలిపే ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీనివాసరావు, దుబాయ్ మస్తాన్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

ప్రమాణ స్వీకార మహోత్సవానికి ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ టీడీపీ కార్యాలయం నుంచి మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార మహోత్సవానికి డీజేతో ర్యాలీగా మంగళగిరికి బయలు దేరారు. ఆదివారం టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో ఉయ్యాల శ్రీనివాసరావు, షేక్ దుబాయ్‌మస్తాన్ పాల్గొని వ్యవసాయ మార్కెట్ యార్డు చేరుకున్నారు. అనంతరం డైరెక్టర్‌లుగా బాధ్యతలు స్వీకరించారు. టీడీపీ పట్టణ ప్రధా న కార్యదర్శి దారాదాసు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ టి. భాస్కర్, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఇట్టా భాస్కర్, ఇట్టా పెంచలయ్య, ఏ. కుసుమ, కె. నిర్మల సాగర్, జి.నాగేశ్వరరావు, ధనుజ్, టి.గోపి, కిరణ్ పాల్గొన్నారు.

శివ నాగేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని గ్రామాల వ్యాపారస్తులు, ప్రజలు, వాహనాలపై వెళ్లే వారిపై ఎనిమిదేళ్లుగా దాడి చేసిన కొండముచ్చును పట్టించడానికి వరగాని గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు చెన్నుపాటి శివ నాగేశ్వరరావు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా స్నేహ మిత్ర మండలి పెదనందిపాడు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చెన్నపాటి శివ నాగేశ్వరరావును, వారి సహచరుడు బండారు రాంబాబును సన్మానించి, వివేకానందుడు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వెలిశెట్టి రమణ, చల్లా నాగరాజు, నూతి పూర్ణయ్య, ఖాసిం,కోడూరి రాజారావు, పర్వతనేని రత్తయ్య, పోపూరి నాగేశ్వరరావు, పాల్గొన్నారు. నిర్వాహకులు ఎలిశెట్టి రమణ మాట్లాడుతూ

శివనాగేశ్వరరావు, రాంబాబును సన్మానిస్తున్న స్నేహమిత్ర

ఎన్నో రోజులుగా కొండముచ్చు ఇబ్బందులు పెడుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో శివనాగేశ్వరరావు రూ.30లు వరకు ఖర్చుపెట్టి కొండముచ్చును పట్టించారు. చెన్నుపాటి శివనాగేశ్వరరావు మాట్లాడుతూ కొండముచ్చు సమస్య మా గ్రామస్తులు నా దృష్టికి తీసుకురావడంతో సమస్యని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు తెలియ చేసి ఫారెస్ట్ అధికారులతో మాట్లాడించి సమస్య పరిష్కరించామని తెలిపారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న కోటేశ్వరరావు

21వ రోజుకు రిలే దీక్ష

ప్రజాశక్తి - తాడికొండ

రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిడుముక్కల గ్రామంలో కోటేశ్వరరావు చేస్తున్న దీక్ష ఆదివారానికి 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు రాజధాని ఏర్పాటు చేసే క్రమంలో తాడేపల్లి, మంగళగిరి, తుళ్లూరు మండలాల్లోని 29 గ్రామ ప్రజలు 33వేల ఎకరాలను రాజధాని నిర్మాణానికి ఇచ్చారని గుర్తు చేశారు. ఉన్న భూములను అభివృద్ధి చేయకుండా, రెండవ విడత సమీకరణ ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల ఎమ్మెల్యే తెనాలి శ్రావణకుమార్ మండలంలోని పలు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించగా రైతుల నుండి మిశ్రమ స్పందన లభించిందన్నారు. రైతులను సంప్రదించకుండా భూసమీకరణ క్షేత్రస్థాయిలో సాధ్యంకాదన్నారు. ఎక్కడో సచివాలయంలో కూర్చుని నిర్ణ యాలు తీసుకోవడం తగదన్నారు. రైతుకు ఎకరాకు రూ.కోటి చెల్లించాలని భూమి లేని కుటుంబాలకు రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, రైతులు తలశిల సుధాకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె తీసుకువస్తున్న ఎమ్మెల్యే దంపతులు

శ్రీభ్రమరాంబా అమ్మవారికి సారె

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం శ్రీ భ్రమరాంబా అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లు, డ్రై ఫ్రూట్స్, సుగంధ ద్రవ్యాలతో అత్యంత వైభావోపేతంగా శాకంబరీదేవిగా అలంకరించారు. పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సతీసమేతంగా అమ్మవారికి ఆషాడ సారెను శాస్త్రోక్తంగా గ్రామస్తులతో కలిసి సమర్పించారు. ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ ఆలయ మర్యాదలతో నరేంద్ర కుమార్ దంపతులకు స్వాగతం పలికారు. వేద పండితుల చేత ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనాలు అందించి స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు దుర్గారావు

229వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారానికి 229వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించారు. దీక్షలో కే.స్టీవెన్, బి.నవనీతం, బి.దానయ్య, సారమ్మ, గురవయ్య కూర్చున్నారు. దుర్గారావు మాట్లాడుతూ ఎసిసి కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదో ప్రజలు గమనిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు లోకేష్ ఎసిసి కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ప్రయత్నం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సిమెంట్ కంపెనీ కార్మికుల నష్టపరిహారపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌కే. సుభాని, డి. సూర్య ప్రకాష్, వై సుబ్బారావు, టి దుర్గా భవాని, ఎస్ఎంబాషా పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న రజక వృత్తిదారులు

22న రజక వృత్తిదారుల రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - తెనాలి

ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న ఉదయం గుంటూరు బిఆర్ స్టేడియం పక్కన ఉన్న ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమా వేశం విజయవంతం చేయాలని పట్టణ రజక వృత్తిదారుల సం క్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు చెరుకూరి బుచ్చిబాబు, ఫణి దపు కోటేశ్వరరావు కోరారు. కార్యక్రమ కరపత్రాలను ఆదివారం పట్టణంలో రజకవృత్తిదారులకు పంపిణీ చేశారు. సమావేశం అజెండా, భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. సభ్యులు నెప్పల్లి వెంకటేశ్వరరావు, బొప్పూడి చెంచయ్య పాల్గొన్నారు.

జిఎంసి స్వచ్ఛ అచీవర్స్ అవార్డుల కార్యక్రమం వాయిదా

ప్రజాశక్తి-గుంటూరు

వాతావరణ శాఖ సూచనల మేరకు మరో రెండ్రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నేడు ఉదయం శ్రీ వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో నిర్వహించ తలపెట్టిన స్వచ్ఛ అచీవర్స్ పుంస్కార సభ తాత్కాలికంగా వాయిదా వేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

యథావిధిగా గ్రీవెన్స్.. : నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్, డయల్ యువర్ కమిషనర్ కార్య క్రమాలు యథావిధిగా జరుగుతాయన్నారు. ఉదయం 9.30 గంటల నుండి 10.30 వరకూ డయల్ యువర్ కమి షనర్, మధ్యాహ్నం ఆ తర్వాత మధ్యాహ్నం 1 గంట వరకూ గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. కావున ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం

కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో అభివృద్ధి పనులువేగంగా చేపడుతున్నామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గము 43వ డివిజన్ సుగాలి కాలనీలో సుపరిపాలనలో – తొలి అడుగు కార్యక్రమాన్నిపెమ్మసాని చంద్రశేఖర్, మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి ఎమ్మెల్యే గళ్ళా మాధవి నిర్వహించారు. తొలుత సాయిబాబా రోడ్డులో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అమలు తీరు, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్డీయే కూటమి పాలన సంవత్సరం పూర్తయిన సందర్భంగా గడపగడపకు తిరిగి ప్రజాభిప్రాయాలు, సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కషి చేస్తామన్నారు. సంక్షేమం అభివద్ధి అనే నినాదంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పలు డివిజన్లలో ఇళ్ల పట్టాల సమస్య ఉందన్నారు. ఎమ్మెల్యే గళ్ళ మాధవితో చర్చించి వాటి పరిష్కారానికి కషి చేస్తామని ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ వివిధ డివిజన్లో అనేక సమస్యలను గుర్తించాము. ఈ సమస్యలు అనేక ఏళ్లుగా తిష్ట వేసి ఉన్నాయని, కనీస మౌలిక సదుపాయాలు లేక వెనుకబడిన ప్రాంతాలు అభివద్ధికి నోచుకోకుండా ఉన్నాయని వీటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ దీపాలు, కుక్కల సమస్యలను తమ దష్టికి తీసుకొస్తున్నారని వీటి పరిష్కారానికి కషి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, మూల్పురి పేరయ్య, వెంకటేష్, సింహాద్రి కనకాచారి, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, ఈరంటి వర ప్రసాద్, నుకవరపు బాలాజీ, ముప్వా వేణు బాబు, గుర్రం ప్రసాద్, తాళ్ళ వెంకటేశ్ యాదవ్, మద్దిరాల మ్యానీ తదితరులు పాల్గొన్నారు.

క్రాంతికుమార్‌ను సత్కరిస్తున్న కేసన శంకరరావు, ఇతర నాయకులు

బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రాంతికుమార్

ప్రజాశక్తి-గుంటూరు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుమ్మర క్రాంతికుమార్ నియమితులయ్యారు. ఆదివారం స్థానిక చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమాశంలో ఈ మేరకు క్రాంతికుమార్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన జరిగిన మీడియా సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, రాష్ట్ర ట్రెజరర్ కన్న మాస్టర్, గౌరవాధ్యక్షులు డాక్టర్ నిమ్మల శేషయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగేమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లె ఈశ్వరరావు ఇతర నాయకులు క్రాంతికుమార్‌ను శాలువాలతో సత్కరించి నియామకపత్రం అందజేశారు. సందర్భంగా కేసన శంకరరావు మాట్లాడుతూ గల్లీ నుండి ఢిల్లీ వరకూ బిసి సంక్షేమ సంఘం చేసిన పోరాట ఫలితంగా జనగణన తోపాటే కులగణన ప్రారంభం అయ్యిందని చెప్పారు. బిసిల అభివృద్ధి సంక్షేమ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు కులగణన పూర్తి చేసిన తర్వాతే జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ రానున్న కాలంలో బీసీల స్థితిగతులను మెరుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి పార్లమెంట్లో మూడు సీట్లు బీసీలకు ఇచ్చేలా కషి చేస్తామన్నారు.రాష్ట్రంలో బీసీ సామాజిక రక్షణ చట్టం పగడ్బందీగా అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, దీని కోసం త్వరలో కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ కోల అశోక్, రాష్ట్ర కోఆర్డినేటర్ బ్రహ్మానందశర్మ, రాష్ట్ర నాయకులు బండారు సోమరాజు,రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ పాల్గొన్నారు.

గుంటూరులో పరిశుభ్రతకు ప్రాధాన్యం

రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధనకు కృషి - ప్రజాశక్తితో గుంటూరు కమిషనర్ శ్రీనివాసులు

కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత పోటీల్లో గుంటూరు నగరపాలక సంస్థ "సూపర్ స్వచ్ఛ్ లీగ్ సిటీస్ అవార్డు" గెలుచుకుందని ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరింత మెరుగైన అవార్డులను గెలుచుకునేందుకు కృషి చేస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.

స్వచ్ఛసర్వేక్షణ ర్యాంకులో గుంటూరుకు ఫైస్టార్ దక్కిందని, మొదటి స్థానం దక్కాలంటే 'సెవన్ స్టార్' ర్యాంకు కోసం కృషి చేయాల్సి ఉందన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఆయన వివరించారు. 'ప్రజాశక్తి ప్రతినిధి' కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

పారిశుధ్య మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు?

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఎప్పటికప్పుడు శానిటేషన్ నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పెంచాం. అన్ని స్థాయిలో శానిటేషన్‌కు అధికారులు దృష్టి పెట్టేలా చేశాం. ఎక్కడా చెత్తకుప్పలు నిల్వ ఉండకుండా చూసేందుకు ఇళ్ల నుంచి చెత్త సేకరణ పగడ్బందీగా జరిగేలా చర్యలు చేపట్టాం. చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి అక్కడ అపరిశుభ్ర వాతావరణం లేకుండా బారికెడ్లు, నెట్‌లను ఏర్పాటు చేశాం. శానిటేషన్ సమస్యను పరిష్కరించేందుకు నగరం మొత్తాన్ని 802 మైక్రో పాకెట్సుగా విభజించాం. 32 శానిటరీ డివిజన్లనుంచి వర్కర్లు ప్రతి రోజు ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. ఇందుకోసం 1604 మందిని ప్రత్యేకంగా కేటాయించాం. మొత్తం 2 వేలకు మందికి పైగా ఉండగా ఇందులో 1604 మంది ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణకు పనిచేస్తారు. అలాగే మేజర్ డ్రైన్లు శుభ్రపర్చడం, వీధులను శుభ్రపర్చడం వీరి బాధ్యతగా ఉంచాం. ఆటోల ద్వారా చెత్త సేకరణకు కొన్ని అడ్డంకులు ఉన్నాయి. ప్రజలు ఎవ్వరూ చెత్తను రోడ్లపై కూడదు. ఇళ్ల వద్దకు వర్కర్లు రాకపోతే వెంటనే చర్యలు తీసుకుంటాం. వెంటనే స్థానిక ప్రజలు సమాచారం ఇవ్వచ్చు. రోడ్లపై బిన్స్ పెట్టకుండా కృషి చేస్తున్నాం. ఎక్కడెక్కడ వర్కర్లు హాజరు కాలేదో తెలుసుకునేందుకు త్వరలోనే కమాండ్ కంట్రోలు రూం ద్వారా మానిటరింగ్ చేస్తాం.

రహదారుల అభివృద్ధికి చర్యలు?

నగరంలోని అన్ని ప్రాంతాల్లో గుంతలు పూడ్చి రహదారుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. అంతేగాక గతంలో మంజూరు అయిన పనులను పూర్తి చేసి రహదారులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. రోడ్లతో పాటు సైడ్ కాల్వలు, డ్రైన్సను నిర్మించడం ద్వారా రోడ్లపై వర్షం నీరు కూడా నిలబడకుండా చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో గుంతులు ఎక్కడ ఉన్నా వాటిని వెంటనే మరమ్మతులు చేస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న రహదారుల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేస్తాం.

నగరంలో ఆశీలు వసూలు నిలిపివేశారా?

ప్రస్తుతం నగరంలో పట్నంబజారులో హోల్ సేల్ వ్యాపార సంస్థల నుంచి తప్ప మిగతా ప్రాంతాల్లో ఎక్కడా ఆశీలు వసూలు చేయడం లేదు. ఆశీలు వసూలుకు ఎవ్వరికి అనుమతి ఇవ్వలేదు. ఎవరైనా అనధికారికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. వెండర్ల జోన్లను ఖరారు అయిన తరువాత ఆశీలు వసూలుకు త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు?

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి పనులు ప్రారంభం అయ్యాయి. బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న వ్యాపార సంస్థలు, ఇతర సంస్థలకు ఇవ్వాల్సిన పరిహారం చెక్కులు అందించే ప్రక్రియ కొనసాగుతోంది. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టు సంస్థ పనులు ప్రారంభించడంతో వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాల్లో రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. బ్రాడీపేట నాలుగో లైను రోడ్డు అభివృద్ధి అసంపూర్తిగా ఉంది. దీనిని త్వరలో పూర్తి చేస్తాం. డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద నీరు నిల్వకుండా డ్రైన్లు నిర్మాణం చేపడుతున్నాం.

నార్ల ఆడిటోరియం అభివృద్ధి?

గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం పిపిపి పద్ధతిలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. అభివృద్ధి చేసిన తరువాత ప్రజల నుంచి వసూలు చేసే రుసుంలో 60 శాతం కార్పొరేషన్‌కు, 40 శాతం సంబంధిత సంస్థకు దక్కేలా ఒప్పందంతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నరెడ్కో క్యాపిటల్ జోన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

నరెడ్కో కాపిటల్ జోన్ గుంటూరు సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు గుంటూరు క్లబ్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 2025–2027 కాలానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులుగా పెరవలి నాగవంశీ, అధ్యక్షులుగా కె.సి.అంకారావు, కార్యదర్శిగా మాదాల శ్రీనివాసరావు, కోశాధికారిగా చిన్న తిరుపతయ్య, వైస్ ప్రెసిడెంటుగా శ్రీనాథ్ వి, యోగేశ్వరరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. అలాగే మిగిలిన అన్ని పదవులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాన సలహాదారు చుక్కపల్లి రమేష్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘ అభివద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించాలనీ, పారదర్శకత, నిబద్ధతతో సభ్యులందరితో కలిసి ముందుకు సాగాలని సూచించారు.నూతన కమిటీ ఆలోచనలతో, సూచనలతో సంఘాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని, రాబోయే రెండు సంవత్సరాల్లో కొత్త ప్రణాళికలతో సేవలందించాలని సంకల్పించింది.

నాట్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

500 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

భాష రమ్యం.. సేవే గమ్యం అనే లక్ష్యంతో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) పూర్వ అధ్యక్షులు పెదనందిపాడుకు చెందిన నూతి బాపయ్య చౌదరి (బాపు) ఈ ప్రాంత ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ అన్నారు. ఆదివారం పెదనందిపాడు కళాశాలలో (నాట్స్) మరియు గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ (గ్లో) పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో పెదనందిపాడులో ఏర్పాటు చేసిన 4 వ మెగా కంటి వైద్య శిబిరాన్ని పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు సుధాకర్, రావి శివరామకృష్ణయ్య, నూతి సుబ్బారావు, సీతాదేవి దంపతులు ప్రారంభి ంచారు. శిబిరంలో శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ అపర్ణ తదితరులు 500 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి 262 మందికి శుక్రవారం ఆపరేషన్లు చేసేందుకు నిర్ణ యించారు. వీరికి ఈనెల 28 నుండి ఉచిత బస్సు సౌకర్యం లో శంకర కంటి ఆసుపత్రి కి తీసుకెళ్లి ఆపరేషన్ చేయటం మొదలు పెట్టి ఆగస్టు 1వ తేదీతో పూర్తి చేస్తామని క్యాంపు ఎగ్జిక్యూటివ్ నాగబాబు తెలిపారు. సభలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ నూతి బాపయ్య చౌదరి పేద ప్రజల అభ్యున్నతికి మరిన్ని మెరుగైన సేవలు చేయాలని ఆకాంక్షించారు. తమ సహకారం కూడా అందజేస్తామన్నారు. కళాశాల ఎన్. సి.సి కెప్టెన్ డాక్టర్ పాతూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన 25 మంది. ఎన్. సి. సి. విద్యార్థులతో పాటు, బాపు ఫ్రెండ్స్ సర్కిల్ బృందం కూడా పాల్గొని కంటి శిబిరానికి వచ్చిన ప్రజలకు సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీర రాఘవయ్య, తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు, నిర్వహణ కమిటీ కన్వీనర్ కాకుమాను నాగేశ్వరరావు, సరిమెళ్ళ చౌదరి, దాసరి సుబ్బారావు, రమేషు, గోవిందరాజు, పోతురాజు, నూతి శ్రీను, పూర్ణయ్య, రాజేంద్ర, అనిత,శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సభను ఉద్దేశించి మాట్లాడుతున్న నర్రా బాలకృష్ణ